ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 291 గురువారం 17-10-2024 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

## కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు

**రబీ సీజన్‌లో పంటల కనీస మద్దతు ధర పెంపు**
**కేంద్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు**




**న్యూఢిల్లీ,అక్టోబర్16:** మోడీ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక ప్రకటనలు చేశారు. ఒకవైపు కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు కానుకగా ఇస్తూనే మరోవైపు రైతులకు కూడా ప్రభుత్వం భారీ దీపావళి కానుకగా ఇచ్చింది. వాస్తవానికి రబీ సీజన్‌లో పంటల కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)ని కేంద్రం పెంచింది. ఇందులో గోధుమ పంటకు క్వింటాల్‌కు రూ.150, ఆవాల పంటపై క్వింటాల్‌కు రూ.300 చొప్పున పెంచారు.రైతులకు దీపావళి కానుకగా రావి పంటల ఎంఎస్‌పిని కూడా పెంచాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. నివేదిక ప్రకారం.. మార్కెటింగ్ సీజన్ 2025–26 కోసం ప్రభుత్వం రబీ పంటలకు కొత్త కనీస మద్దతు ధర (%మీరా%)ని నిర్ణయించింది. ఇందులోభాగంగా గోధుమల ఎంఎస్‌పి క్వింటాల్‌కు రూ.150 పెంచి రూ.2,425కి చేరుకుంది. ఇది ఇప్పటివరకు క్వింటాల్‌కు రూ.2,275గా ఉంది. ఆవాలపై ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ.300 పెంచి క్వింటాల్‌కు రూ.5,650 నుంచి రూ.5,950కి పెరిగింది. అదేవిధంగా, కందుల ఎంఎస్‌పిని క్వింటాల్‌కు రూ.210 పెంచాలని నిర్ణయించారు. దాని కొత్త ఎంఎస్‌పి క్వింటాల్‌కు రూ.5,650గా మారింది. ఇది గతంలో క్వింటాల్‌కు రూ.5440గా ఉంది. ఇది కాకుండా కందులుపై ఎంఎస్‌పి క్వింటాల్‌కు రూ.275 పెంచి క్వింటాల్‌కు రూ.6,425 నుంచి రూ.6,700కి పెంచారు. కుసుమ ధర రూ.5,800 నుంచి రూ.140 పెరిగి రూ.5,940కి చేరింది.రైతులకు వారి పంటలకు ప్రభుత్వం హామీ ఇచ్చే కనీస మద్దతు ధర ఎమ్ఎస్పీ అంటారు. ప్రభుత్వం రైతుల నుంచి పంటలను కొనుగోలు చేసే ధర ఇది. పంటల ధరల్లో హెచ్చుతగ్గుల వల్ల నష్టాల నుంచి రైతులను రక్షించడమే దీని లక్ష్యం. ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ .. రైతుల సంక్షేమం కోసం కేంద్రం కట్టుబడి ఉందన్నారు. పంజాబ్–హర్యానా సరిహద్దులో ఉన్న రైతుల గురించి కూడా ప్రస్తావించారు. రైతుల సంక్షేమానికి పూర్తి కట్టుబడి ఉన్నామని, రైతులకు మేలు చేసే అనేక నిర్ణయాలు తీసుకున్నామన్నారు.

## రైతులకు అనుకూలంగా ప్రభుత్వం

**అనేక నిర్ణయాలు తీసుకున్నామన్న కోమటిరెడ్డి**

**– దీపావళికి ముందే మిగిలిన వారికి రుణమాఫీ – మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి**




**తొలి సమయం ప్రధాన ప్రతినిధి నల్లగొండ,అక్టోబర్16:** రైతు సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్ఎల్‌బీసీ బత్తాయి మార్కెట్ యార్డులో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా ధాన్యం పండుతుందని, రైతులు ధాన్యాన్ని ఎండబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే 24 గంటల్లో ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బులు చెల్లించే ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్ఎల్‌బీసీ వద్ద గతంలో బత్తాయి పండ్ల కోసం నిర్మించిన షెడ్డులో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రితో విజ్ఞప్తి చేశారు. అనంతపూర్ తర్వాత నల్గొండ జిల్లాలోనే అత్యధికంగా బత్తాయి సాగు జరుగుతుందని, సుమారు 50,000 ఎకరాలలో బత్తాయి సాగు చేస్తారని తెలిపారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో భాగంగా నల్గొండ జిల్లాలో 375 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, ఇందులో భాగంగా ఇప్పటి వరకే 152 కొనుగోలు కేంద్రాలు ప్రారంభిం చామన్నారు.

ఈ వారం చివరి వరకు అన్ని కేంద్రాలు ప్రారంభిస్తామని, కొనుగోలు కేంద్రాలలో తేమ కొలిచే యంత్రాలు,తూకం యంత్రాలు, లారీలు, హమాలీల వంటి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతులకు వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు రెండు శుభవార్త లు చెప్పారు. నిడమనూర్ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి లు హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జానారెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ క్రమంలో వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల రైతు భరోసా, రూ.2లక్షల రుణమాఫీ గురించి ప్రస్తావించారు. దీపావళి పండుగ కంటే ముందే మిగిలిన 4లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని తెలిపారు. త్వరలో రైతు భరోసా కూడా అందిస్తామని అన్నారు. పంటరుణం రూ.2 లక్షల కన్నా పైనున్న వారికి విడతల వారీగా డబ్బులు జమ చేస్తామని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ధాన్యం కొనుగోలు చేపడతామని.. రూ.500 బోనస్ కూడా ఇస్తున్నామని మంత్రి వివరించారు. రాష్ట్ర రైతాంగానికి అనుగుణమైన పరిపాలన అందిస్తున్నామని.. గత ప్రభుత్వ హయాంలో వ్యవస్థలు చిన్నాభిన్నమైయ్యాని మంత్రి తుమ్మల అన్నారు. ఖూఃఅతోపాటు, నల్గొండ జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేసి తీరుతామని తెలిపారు. కుందురు జానారెడ్డి1982 నుంచి రాజకీయాల్లో తన చేయి పట్టుకొని నడిపించారని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. తన రాజకీయ గురువు జానారెడ్డే అని ఆయన చెప్పారు. రాష్ట్ర రాజకీయాల్లోతనను నిలబెట్టింది జానారెడ్డి అని చెప్పుకొచ్చారు.12 శాఖల మంత్రిగా పని చేసిన జానా రెడ్డి తన్ను ప్రోత్సహించారని అన్నారు. జానారెడ్డి రాజకీయం అంటే నీతి నిజాయితీ నిబద్ధతతో ఉంటాయని మంత్రి తుమ్మల చెప్పారు.

## హైకోర్టులోనూ ఐఏఎస్‌లకు చుక్కెదురు

**సొంత రాష్ట్రాల్లోనే రిపోర్ట్ చేయాలి**
**ఐఏఎస్ అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీ**



**తొలి సమయం హైదరాబాద్,అక్టోబర్16:**
అనుకున్నదే అయ్యింది. తెలంగాణలోనే పనిచేస్తామంటూ పట్టుబట్టిన ఆ నలుగురు ఐఏఎస్ అధికారులకు హైకోర్టు ఊహించని సూచనలు అందజేసింది. వెంటనే కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ క్యాడర్ ఐఏఎస్?లు క్యాట్ ఆదేశాలపై హైకోర్టులో లంచ్?మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఆమ్రపాలి, వాకాటి కరుణ, రోనాల్డ్ రోస్, వాణీప్రసాద్‌ల లంచ్‌మోషన్ పిటిషన్‌ను అనుమతించిన కోర్టు మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణ ప్రారంభించింది. దాదాపు 2 గంటల విచారణ తర్వాత తీర్పును రిజర్వ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అంతేకాకుండా సదరు అధికారులు తమకు కేంద్రం (డిఓపీటీ) డిపార్ట్ మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ ఆదేశాల ప్రకారం ఆయా రాష్ట్ర ప్రభుత్వానికి వెంటనే రిపోర్ట్ చేయాలని సూచనలు ఇచ్చింది. మీ అభ్యర్థనపై కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ అనుకూలమైన తీర్పు ఇవ్వకపోతే కోర్టుకు రావటం సరికాదని తెలిపింది. ఒకవేళ మీ పిటీషన్ డిస్మిస్ చేస్తే మళ్లీ కోర్టుకే వస్తారని, పని చేసేందుకు ఎక్కడ అవకాశం కల్పిస్తే అక్కడకు వెళ్లి పని చేయాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. వీటిపై విచారణ తర్వాత చేస్తామని తెగేసి చెప్పేసింది. ఫలితంగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో అఖిల భారత సర్వీస్ అధికారుల కేటాయింపులపై డీఓపీటీ ఆదేశాలకు అనుగుణంగా అలాటెడ్ రాష్ట్రాల్లో రిపోర్టు చేయాల్సిన తప్పని పరిస్థితి నెలకొంది.రొనాల్డ్‌రోస్, శివశంకర్, హరికిరణ్, ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీ ప్రసాద్ డీఓపీటీ ఉత్తర్వులపై తెలంగాణ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.తాము ఉన్న క్యాడర్ లోనే పనిచేస్తామని, బదిలీలు లేకుండా కొనసాగించాలని కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. విచారించిన క్యాట్, డీఓపీటీ ఉత్తర్వులను నిలిపేసేందుకు నిరాకరించింది. దీంతో బుధవారం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసి అత్యవసరంగా విచారించాలని కోరారు. ఫలితంగా తీర్పును రిజర్వు చేస్తూ న్యాయస్థానం ప్రత్యేక సూచనలు ఇచ్చింది. మరోవైపు కేటాయించిన రాష్ట్రాల్లో చేరేందుకు డీఓపీటీ గడువు నేటితో తీరనుంది.జస్టిస్ అభినంద్ కుమర్ శావిలి బెంచ్ పిటీషన్లను విచారించింది. కేంద్రం తరఫున న్యాయవాది వాదిస్తూ ఏ అధికారి ఎక్కడ పని చేయాలో చెప్పే అధికారం కోర్టుకు లేదన్నారు. సివిల్ సర్వీస్ అధికారులు పూర్తిగా కేంద్రం అధీనంలో పనిచేస్తారని, ఈ మేరకు కేంద్రంలోని సీనియర్ అధికారులే వీరి పోస్టింగ్లులపై నిర్ణయాలు తీసుకుంటారన్నారు. విచారణ సమయంలో హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అధికారులు ప్రజా సేవ కోసమే ఉన్నారని, ఎక్కడ పోస్టింగ్ ఇస్తే అక్కడే పనిచేయాలని సూచించింది.

## హర్యానా సిఎంగా మరోమారు నాయబ్ సింగ్ సైనీ

**గవర్నర్ దాత్తాత్రేయను కలిసిన,సైనీ అమిత్ షా**
**నేడు సైనీ ప్రమాణ స్వీకారానికి బిజెపి నిర్ణయం**



**చండీగఢ్,అక్టోబర్16** హర్యానాలో బీజేపీ ప్రభుత్వం కొలువుతీరనుంది. ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీని రెండోసారి ముఖ్యమంత్రి కొనసాగించేందుకు బీజేపీ అధిష్ఠానం నిర్ణయించడం, ఇందుకు అనుగుణంగా బీజేపీ శాసనసభా పక్షం బుధవారం ఉదయం జరిపిన సమావేశంలో ఆయన పేరును ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదించడంతో ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

ఆ వెంటనే కేంద్ర పరిశీలకునిగా వెళ్లిన అమిత్‌షా, నయబ్ సింగ్ సైనీ రాజ్‌భవన్‌కు చేరుకుని గవర్నర్ బండారు దత్తాత్రేయను కలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరారు. సైనీ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించిన ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు సావిత్రి జిందాల్, దేవేంద్ర కద్యాన్, రాజేష్ డూన్‌లు కూడా గవర్నర్‌ను కలిసిన బీజేపీ ప్రతినిధి బృందంలో ఉన్నారు. దీనికి ముందు, పంచకులలో జరిగిన సమావేశంలో బీజేపీ శాసనసభా పక్ష నేతగా నయబ్ సింగ్ సైనీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## బిసి కులగణను స్వాగతిస్తున్నాం

**కాంగ్రెస్ మంచి పనులు చేస్తోందన్న కోదండరామ్**

**తొలి సమయం హైదరాబాద్,అక్టోబర్16:** బీసీ కులగణన పారదర్శకంగా జరిపి, దీని ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖరారు చేయాలని తెలంగాణ జన సమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం కోరారు. నాంపల్లి పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కులగణనను తాము స్వాగతిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ చేసిన సమగ్ర కుటుంబ సర్వే ఎక్కడ పోయిందో తెలియదన్నారు. ప్రజల మధ్య సమగ్ర కుటుంబ సర్వే పెట్టలేదు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రారంభించిన పథకాలు, ప్రాజెక్టులను ఇప్పుడు విమర్శిస్తోంది.. గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్ల హాస్టల్ ల అద్దెలు చెల్లించడంలో కాస్త జాప్యం అయింది. ఆరోగ్య శ్రీ, స్టూడెంట్స్ ఫీజుల బకాయిలు , ఉద్యోగుల డీఏలు గత ప్రభుత్వం నుంచే పెండింగ్‌లో ఉన్నాయి.

## జైల్లో నన్ను చంపేందుకు బీజేపీ కుట్ర

**- పదేళ్లుగా ఢిల్లీ అభివృద్ధి పనులను బీజేపీ నిలిపివేసింది**
**- కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు**



**న్యూఢిల్లీ,అక్టోబర్16:** తీహార్ జైల్లో తనను చంపేందుకు బీజేపీ కుట్ర చేసిందని మాజీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత కేజ్రీవాల్ ఆరోపణలు చేశారు. పార్టీ ప్రజా ప్రచార కార్యక్రమంలో భాగంగా జరిగిన ర్యాలీలో కేజ్రీవాల్ ప్రసంగించారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో తీహార్ జైల్లో ఉన్నప్పుడు తనకు ఇన్సులిన్ ఇచ్చేందుకు నిరాకరించారని.. సకాలంలో ఇంజెక్షన్ తీసుకోకపోతే చనిపోయే అవకాశం ఉందని తెలిపారు. ఈ మేరకు తీహార్ జైల్లో చంపేందుకు బీజేపీ కుట్ర చేసిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇక ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి వస్తే.. ఉచిత విద్యుత్ పథకం ఎత్తేస్తారన్నారు. పదేళ్లుగా ఢిల్లీ అభివృద్ధి పనులను బీజేపీ నిలిపివేసిందని కేజ్రీవాల్ ఆరోపించారు.ఇక తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, ఢిల్లీలో ప్రజల కోసం పనిచేస్తున్నందున తనను జైలుకు పంపారని తెలిపారు. తాను బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత పగిలిన రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీలు శుభ్రం చేయడం, నీటి సరఫరా నిరాంతరాయంగా ఆప్ ప్రభుత్వం కొనసాగిస్తుందని చెప్పారు. ఇక ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడానికి గల కారణాలను వివరిస్తూ ఢిల్లీ ఓటర్లకు కేజ్రీవాల్ లేఖ రాశారు.

# యధేచ్ఛగా పిల్టర్ ఇసుక దందా

**వాగులు,కుంటలు, ప్రభుత్వ భూముల లో కొంతమంది అక్రమార్కులు రాత్రి పగలు తేడా లేకుండా ఇసుకను తరలింపు**

**ప్రజలను మోసం చేస్తున్న పిల్టర్ ఇసుక దందావ్యాపారులు**

**ఒక్కో ట్రాక్టర్ ఇసుకను ఆరు, ఏడు వేయిలకు విక్రయం**

**పట్టించుకోని అధికారులు అధికారుల కనుసన్నుల్లోనే ఇసుక వ్యాపారం**







**తొలి సమయం, ఎల్కతుర్తి, అక్టోబర్ 16**
హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని గ్రామ శివారులో ఉన్నటువంటి వాగు కుంట, ప్రభుత్వ భూముల వద్ద నుంచి కొంతమంది అక్రమార్కులు రాత్రి పగలు లేకుండా (పిల్టర్ ఇసుక ) మట్టి ఇసుకను కడిగి ఇసుకను తరలిస్తున్నారు. ఈ ఇసుక భవన నిర్మాణాలకు పనిచేయదు.ఈ విషయంపై గ్రామస్తులు అక్రమార్కుల ఆగడాలను అరికట్టాలని కోరుతున్నారు. గ్రామ శివారులోని తూర్పు వాగు కుంట వద్ద వాగు నుండి ఇసుకను (పిల్టర్) మట్టిని నీటితో కడిగి దుబ్బ ను మట్టి పోయి దుబ్బ ఇసుక ఏర్పడుతుంది.పిల్టర్ చేసిన ఇసుకను రాత్రి పగలు తేడా లేకుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఆయా శాఖల అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వున్నాయి. అధికారుల కనుసన్నులోనే ఇసుక వ్యాపారం జరుగుతుందనేది గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు.రెవెన్యూ అధికారులు, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమ ఇసుక వ్యాపారులు రెచ్చిపోతున్నారు. ఎ ధికారులు మముల్ని ఎవరు ఏం చేయరు అని బహిరంగంగానే అంటున్న ఇసుక వ్యాపారులు. పిల్టర్ చేసిన ఇసుకను వివిధ ప్రాంతాలకు తరలించుకుంటూ ఆరు నుండి ఏడు రూపాయల వరకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటు న్నారని నాణ్యతలేని ఇసుకని అమ్ముకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, రెవిన్యూ అధికారులు అక్రమఇసుక రవాణానుఅరికట్టాలని స్థానిక ప్రజలు కోరుచున్నారు.

# వేట్టయన్ ది హంటర్ అనే సినిమా ఒక్క సందేశాత్మక చిత్రం

**- నేటి విద్యా విధానంపై ఆలోచింపజేసే చిత్రం ఇది - మొగురం రమేష్ సీనియర్ జర్నలిస్ట్**



**తొలి సమయం కరీంనగర్, అక్టోబర్ 16**
చట్టం రాజ్యాంగం పై, నమ్మకం కల్పించింది, విద్యపై నమ్మకం కల్పించింది, ప్రైవేటు విద్యా సంస్థలు, కోచింగ్ సెంటర్లు విద్యార్థులను ఎలా మోసం చేస్తేయో అనేది చూపించింది.ప్రభుత్వ ఉపాధ్యాయురాలు పేద విద్యార్థుల కోసం పోరాటం చేసి కార్పొరేట్ కోచింగ్ సెంటర్ల యజమానుల చేత చంపబడ్డది.. ఈ సినిమా లో హీరో రజనీకాంత్ అయితే, విలన్ రానా అయినప్పటికీ. చాలా స్పష్టంగా అందరికీ అర్థం అవుతుంది. అలాగే పోలీసులు విచారణలో కూడాఎలాంటి తప్పులు చేస్తారు, అనేది కూడా ఈ సినిమాలో చాలా స్పష్టంగా చూపించారు. ఆ తర్వాత ప్రభుత్వ ఉపాధ్యాయులు హత్య పై ఉపాధ్యాయ సంఘాలు ధర్నాల ఆందోళనతో ప్రభుత్వాలు దిగి వస్తాయి , ఒక సమర్థవంతమైన అధికారికి విచారణ బాధ్యతలు అప్పజెప్పడం జరుగుతుంది. అందులో ఒక అధికారి తన పదవి కోసం తప్పు చేయడం జరుగుతుంది. ఆ పరిణామాల అనంతరం నిజాయితీతో కూడిన పోలీస్ అధికారి రజినీకాంత్ , మానవ హక్కుల సంఘం నేతగా ఉన్న జస్టిస్ పాత్రలో ఉన్న అమితాబచ్చన్ రాజ్యాంగ స్ఫూర్తితో హీరో రజనీకాంత్ చివరకు చట్టాన్ని, ధర్మాన్ని, కాపాడడం జరుగుతుంది. ప్రభుత్వ ఉపాధ్యాయురాలును చంపిన వారిని శిక్షిస్తారు .ఇది ఆ సినిమా రివ్యూ ప్రజలుపేక్షకులు, విద్యను కొనుక్కునే తల్లిదండ్రులు, ప్రభుత్వ పాఠశాలలో చదువే తల్లిదండ్రులు తప్పకుండా చూడాల్సిన చిత్రం ఇది. నేటి విద్యా విధానంపై చాలా స్పష్టంగా ఈ సినిమాలో చూపించారు. ప్రజలను కదిలించడంలోనూ , ఆలోచింపజేయడంలో సినిమాల పాత్ర చాలా గొప్పది.

# మిస్డ్ కాల్ చేయండి - ఓటు నమోదు పొందండి

**- పట్టభద్రుల సౌకర్యార్థం మొబైల్ నంబర్ 9240021444**

**- మిస్డ్ కాల్ క్యాంపియన్ పోస్టర్ ను ఆవిష్కరించిన అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి**






**తొలి సమయం కరీంనగర్, అక్టోబర్ 16**
పట్టభద్రుల ఓటరు నమోదు సులభతరం చేసేందుకు మిస్డ్ కాల్ క్యాంపెయిన్ ద్వారా ఒక మొబైల్ నెంబర్ ను ఏర్పాటు చేశామని ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్ అల్ఫోర్స్ మెయిన్ క్యాంపస్ లో పట్టబద్రుల ఓటు నమోదు కోసం మిస్డ్ కాల్ క్యాంపియన్ పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పట్టభద్రుల ఓటు వ్ నమోదు కోసం మిస్డ్ కాల్ క్యాంపెయిన్ ద్వారా ఓటు నమోదు చేసుకునేందుకు 50 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామని వెల్లడించారు. తాము కేటాయించిన నంబర్ 9240021444 కు మిస్డ్ కాల్ చేసినట్లయితే తమ సిబ్బంది అందుబాటులోకి వచ్చి ఓటు నమోదుకు సహకరిస్తారని వెల్లడించారు. ఓటరు నమోదుకుఒక కలర్ ఫోటో తో పాటు , ఆన్ లైన్ ఒరిజినల్ డిగ్రీ మెమోను అప్ లోడ్ చెయ్యాలని పేర్కొన్నారు. గతంలో 1,లక్ష 97 వేల పట్టబద్రులు మాత్రమే ఓటర్లుగా నమోదు కాబడ్డారని ..ఇప్పుడు 4లక్షల సభ్యత్వ నమోదు టార్గెట్ గా పనిచేస్తున్నామని వెల్లడించారు.

**ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల ఫీజు రీయింబర్స్ మెంటు నిధుల విడుదలకు సహకరిస్తా**

రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ ,పీజీ కళాశాలల యాజమాన్యాల ఫీజు రియంబర్స్ మెంటు నిధులు విడుదల గాక ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కళాశాల యాజమాన్యం సమన్వయం పాటించాలని కోరారు.గత నెల రోజులుగా ఉమ్మడి కరీంనగర్ అదిలాబాద్ ,నిజామాబాద్ మెదక్ జిల్లాల వ్యాప్తంగా ఓటర్ నమోదు అవగాహన కోసం పర్యటించానని చాలామంది ఉద్యోగులు ,నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని వారి సమస్యలను పరిష్కరించేందుకు శాసనమండలిలో పట్టభద్రుల గొంతుకనవుతానని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న డిఏ ల మంజూరు కి కృషి చేస్తానని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధపడే యువత కోసం దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక యాప్ ను రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. ఈ యాప్ ద్వారా నిరుద్యోగులకు 6 నెలలు ఉచిత శిక్షణ ఇస్తామని వెల్లడించారు. తనను పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉమ్మడి నాలుగు జిల్లాలలో యువతకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.. తాను ఎమ్మెల్సీగా ఏ పార్టీ నుండి పోటీ చేస్తారు అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ..ప్రస్తుతం తాను సభ్యత్వ నమోదు పై దృష్టి పెట్టినట్టు పేర్కొన్నారు. ఓ ప్రధాన పార్టీ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నట్టు వెల్లడించారు.పార్టీ టికెట్ రానట్లయితే స్వాతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు కూడా సిద్ధమైనట్టు వెల్లడించారు

# టెక్నాలజీ రంగంలో పెట్టుబడుల ఆకర్షణె లక్ష్యం

**స్టెరిలైట్ కంపెనీతో టీ ఫైబర్ ఎంవోయు**

**వందలాది మంది యువతకు శిక్షణకు అవకాశం**

**మోబైల్ కాంగ్రెస్‌కు హాజరైన మంత్రి శ్రీధర్ బాబు**

**న్యూఢిల్లీ,అక్టోబర్16:** స్టెరిలైట్ కంపెనీతో టీ ఫైబర్ ఎంవోయు కుదుర్చుకుందని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. దీని వల్ల వందలాది మంది యువత శిక్షణ పొందబోతున్నారని తెలిపారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న వారు.. టెలికాం రంగంలో ఉపాధి లభిస్తుందని చెప్పారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఆసియాలోనే బిగ్గెస్ట్ టెక్ ఇవెంట్ ఇండియా మొబైల్ కాంగ్రెస్ -2024 సదస్సును మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సదస్సుకు 10 మంది ప్రతినిధుల బృందంతో తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు హాజరయ్యారు. అలాగే ఈ సదస్సుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ క్యాపిటల్ పార్ట్‌నర్‌గా తెలంగాణ రాష్ట్రం వ్యవహరిస్తుంది. ఈ సదస్సుకు హాజరైన ఐటీ మంత్రి డి.శ్రీధర్ బాబు బుధవారం మాట్లాడుతూ... టెక్నాలజీ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని తెలిపారు. ఆ క్రమంలో అనేక టెలికాం సంస్థల ప్రతినిధులతో తాము సమావేశమై చర్చించామన్నారు. కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా.. ప్రత్యేకంగా టెలికామ్ మ్యానుఫ్యాక్చరింగ్ పాలసీని రాష్ట్రాలు నిర్ణయం చేయవచ్చంటూ తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ టెలికాం మ్యానుఫ్యాక్చరింగ్ పాలసీ తెలియ జేయడం జరిగిందని చెప్పారు.మ్యానుఫ్యాక్చరింగ్ పాలసీ విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రో యాక్టివ్‌గా తీసుకొని.. విధానపర నిర్ణయం తీసుకొని పాలసీని ఇనిషియేట్ చేస్తామన్నారు. దీనివల్ల అనేక టెలికాం మ్యానుఫ్యాక్చరర్స్ తెలంగాణకు వచ్చే అవకాశం ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అతి త్వరలో దీనిని తీసుకొచ్చే కార్యక్రమం తీసుకుంటామన్నారు. ఐటీ శాఖల మంత్రి జ్యోతిరాధిత్య సిందియా, పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఐటీ మినిస్టర్ల కాన్ఫరెన్స్‌లో తాము పాల్గొన్నట్లు తెలిపారు. ప్రభుత్వం తరఫున టీ ఫైబర్, ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్‌కు సంబంధించి గ్రామంలోని ప్రతి ఇంటికి నెట్‌వర్క్ సదుపాయం కల్పించేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని ఈ సందర్భంగా వారికి వివరించినట్లు ఆయన పేర్కొన్నారు. 2014 అనంతరం భారత నెట్ అని ఫేస్ టు ఫేస్ వన్ అని కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని వివరించారు.

# నేత్ర దానం పై అవగాహన

**రమేశ్ సింగ్ నేత్రదాత సంస్మరణ సభ**





**తొలి సమయం సైదాపూర్ అక్టోబర్ 16(స్వేచ్ఛ న్యూస్):**
మండలంలోని దుద్దెనపల్లి గ్రామవాసి ఆర్టీసీ డ్రైవర్ ఠాకూర్ రమేష్ సింగ్ (46)తేదీ 6 అక్టోబర్ 2024 న విధి నిర్వహణలో మరణించగా,సమాజ హితం కోరి కుటుంబ సభ్యులు భార్య మంజుల,కుమార్తెలు అర్చన, అఖిల, అన్విత లా సహకారంతో నేత్రదానం చేసి ఇద్దరి అందులకు చూపునిచ్చారు.నేత్ర వైద్య విద్య కు తోడ్పడినారు.దశదిన కర్మకాండ కార్యక్రమంలో అనంతరం,తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించి గొప్ప త్యాగం చేసిన కుటుంబ సభ్యులకు శాలువాతో సత్కరించి, నేత్రదాన అభినందనపత్రం అందజేసి ప్రత్యేక కృతజ్ఞతలు, తెలిపారు.దశదిన కార్యక్రమమునకు వచ్చిన బంధుమిత్రులందరికీ నేత్ర దానంపై అవగాహన కల్పించారు.మనమందరం కూడా వీరిని ఆదర్శంగా తీసుకొని,మరణానంతరం నేత్ర, అవయవ,శరీర దానం చేసి సమాజానికి తోడ్పడుదామని,మృతదేహాన్ని కాలిస్తే బూడిదవుతుందనీ,పాతి పెడితే మట్టి అవుతుందనీ,సామాజిక బాధ్యతగా భావించి నేత్ర శరీర దానం చేసే జీవితాలను సార్ధకం చేసుకుందామని అసోసియేషన్ ప్రతినిధులు అవగాహన కల్పిస్తూ బంధుమిత్రులను కోరినారు. వివరాలకు 8790548706,9441454286, సెల్ నెంబర్ సంప్రదించవలసి నదిగా కోరినారు.ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు అసోసియేషన్ అధ్యక్షులు మల్లారెడ్డి,ప్రధాన కార్యదర్శి శంకర్రావు యాదవ్,జనార్ధన్ రెడ్డి సలహాదారు,దళపతి సలహాదారు తదితరులు పాల్గొన్నారు.

# చారిత్రాత్మక సింగరయ్య గుడి నిర్మాణం కొరకు పరిశీలించిన దేవాదాయ శాఖ అధికారులు

**తొలి సమయం సైదాపూర్ అక్టోబర్ 16**



మండల కేంద్రంలోని 200 సంవత్సరాల చారిత్రాత్మక కట్టడం పురాతన ఆలయం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి (సింగరయ్య) గుడి శిథిల వ్యవస్థలో ఉండడం సైదాపూర్ మండల నాయకుల ,గ్రామస్తులు గుడి పునర్నిర్మాణం చేసి పూర్వ వైభవం తీసుకురావాలని,బిసి,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన మంత్రి సంబంధిత దేవాదాయ శాఖ ఉన్నతాధికారులను పరిశీలనకు పంపించారు.దేవాదాయ శాఖ అధికారులు ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదిక కొరకు సంబంధిత అధికారులతో స్థానిక నాయకులతో పరిశీలించారు.ఇక్కడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొంత సుధాకర్,సింగిల్ విండో డైరెక్టర్ బొమ్మగాని రాజు,కుతూరు విద్యాన్ రెడ్డి,కామని వీరేశం,మునిగంటి సంతోష్, అనగొని శ్రీనివాస్,గోపగోని నవీన్,మాడేపు రమేష్,గుళ్ళ అశోక్,నీర్ల వెంకట్రాజ్యం,బోల్ల సమ్మయ్య,పూసల రమేష్,నీర్ల కుమారస్వామి,గుడిపేల్లి శ్రీధర్, బోనగిరి అనిల్,వేముల సాయికుమార్,మడేపు రాహుల్,తదితరులు పాల్గొన్నారు.

# వాజేడు మండల కేంద్రంలో ఎంపిపిఎస్ పాఠశాలలో ఉపాధ్యాయునికి ఘనంగా సన్మానం




**తొలి సమయం వాజేడు, అక్టోబర్ 16**
ములుగు జిల్లా వాజేడు మండలంలో ఎంపిపిఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు బదిలీ పై వెళ్తున్న ఇప్ప బాలాజీ ని సన్మానిచ్చిన గ్రామస్థులు. అనంతరం అయన మాట్లాడుతూ ఎప్పటికీ ఈ పాఠశాలను మర్చిపోను మీకున్నటువంటి అనుబంధాన్ని కూడా పంచుకుంటాను.ఇంతకాలం ఈ పాఠశాలలో పని చేసినటువంటి నాకు సహకరించి గ్రామస్తులకి రుణపడి ఉంటానని పాఠశాల పిల్లలకి సూచనలు ఇచ్చారు.ప్రతి ఒక్క పిల్లవాడు నాకంటే విద్యావంతులు కావాలి పై చదువులు చదవాలిఅని భవిష్యత్ తరాలకి దిక్సూచిగా మీరు నడవాలి అని అన్నారు.అదేవిధంగా ఇంతకాలం పాఠశాలలో పని చేసినటు వంటి వర్కర్స్ కి వారి గుర్తు కోసం చీరలు పంపిణీ చేసారు.అదేవిధంగా కొత్తగా వచ్చినటువంటి ఉపాధ్యాయుల కి ఉన్నటువంటి పరిస్థితుల తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కల్లూరు సతీష్ వారికి చాలువా కప్పారు.అదేవిధంగా పాఠశాల వర్కర్స్ ను సన్మానం చేసారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నాయకులు బోదెబోయిన సురేష్ మాట్లాడుతూ గతంలో పాఠశాల అభివృద్ధి విషయాల్లో పట్టించుకోని ప్రధానోపాధ్యాయులు పట్టుదలతో చాలా అభివృద్ధి జరిగిందని వారన్నారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ పి లు వెంకటేశ్వర్లు, శ్రీను, బద్రి, వర్కర్స్ సత్యమ్మ, సీత, వెంకటలక్ష్మి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



# గ్రామీణ స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలి

### సీఎం కప్ టార్చ్ ర్యాలీ ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య





**తొలి సమయం, హన్మకొండ, అక్టోబర్ 16**


గ్రామీణ స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడల్లో విద్యార్థులు, యువత రాణించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ వేయి స్తంభాల దేవాలయం వద్ద నుండి హనుమకొండ జిల్లా కలెక్టరేట్ వరకు పల్లెల నుండి ప్రపంచ స్థాయి ఛాంపియన్లుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సీఎం కప్- 2024 టార్చ్ ర్యాలీని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారుల ప్రతిభను ప్రపంచ స్థాయి వరకు రాణించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ ను నిర్వహిస్తుందన్నారు. త్వరలో ప్రారంభమయ్యే సీఎం కప్ పోటీలలో గ్రామ స్థాయి నుండి జాతీయ స్థాయి వివిధ క్రీడాంశాలలో క్రీడాకారులు రాణించి అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రతిభను చాటాలన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తుందని అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు యువత సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. వరంగల్ నుండి వచ్చిన సీఎం కప్ టార్చ్ ను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, జిల్లా యువజన, క్రీడల అధికారి గుగులోత్ అశోక్ కుమార్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎండి అజీజ్ ఖాన్, తదితరులు స్వీకరించి వేయి స్తంభాల గుడి వద్ద నుండి అధిక సంఖ్యలో తరలి వచ్చిన క్రీడాకారులు, క్రీడాభిమానులు, యువకులు సీఎం కప్ టార్చ్ తో ర్యాలీగా హనుమకొండ కలెక్టరేట్ వైపు బయలుదేరారు. ఈ ర్యాలీ వేయి స్తంభాల దేవాలయం వద్ద నుండి హనుమకొండ చౌరస్తా, పోలీస్ కమిషనరేట్ జంక్షన్, అంబేద్కర్ జంక్షన్, కాళోజీ జంక్షన్, వరంగల్ కలెక్టరేట్, అదాలత్ మీదుగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్ వరకు సాగింది. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ వద్ద సీఎం కప్ టార్చ్ ను జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, తదితరులు అందుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పల్లె నుంచి ప్రపంచ స్థాయి వరకు క్రీడాకారులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సీఎం కప్ 2024 పై అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా టార్చ్ ర్యాలీ నిర్వహిస్తుందని అన్నారు. సీఎం కప్ టార్చ్ ర్యాలీ హనుమకొండ జిల్లాకు చేరుతుందని, ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, విద్యార్థులు, క్రీడాభిమానులు పాల్గొనడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించే విధంగా ప్రోత్సహించాలన్నారు. సీఎం కప్ టార్చ్ ర్యాలీ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక కళాకారులు పలు గీతాలను ఆలపించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అధికారులు ఏ. ఎన్.కె గోకుల్, మధు, రతన్ బోస్, తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్ రావు, రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి పవన్ కుమార్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమేష్ రెడ్డి, ఖో ఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్యామ్, వరంగల్ నీట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ రవికుమార్, కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపల్ ఎ. టి. బి. టీ. ప్రసాద్, పలువురు పోలీస్ అధికారులు, ట్రైనీ కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.




# నూతన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి : జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య






**తొలి సమయం, హన్మకొండ,అక్టోబర్ 16**

అమలులోకి వచ్చిన నూతన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో రెవెన్యూ, పోలీస్, విద్య, విద్యుత్, రవాణా, ఎక్సైజ్, పౌర సరఫరాలు, మైనింగ్, యాంటీ నార్కోటిక్స్, వైద్య ఆరోగ్య, తదితర శాఖల ఉన్నతాదికారులతో భారతీయ నూతన న్యాయ చట్టాలు, ఎన్ ఫోర్స్మెంట్, రోడ్డు భద్రత అంశాలపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ అవుతున్న రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టకుండా పటిష్ట చర్యలు చేపట్టాల న్నారు. సమస్యలపై దృష్టి సారించేందుకు మండల, జిల్లాస్థాయిలో అధికారులు సమన్వయ సమావేశాలను నిర్వహించా లన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయం సమన్వయంతో పనిచేయాల న్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడు తూ దేశవ్యాప్తంగా నూతనంగా న్యాయ చట్టాలు అమలులోకి వచ్చాయని అన్నారు. ఐపిసి స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినయం చట్టాలు అమలవుతున్నాయని అన్నారు. ఐపీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, సిఆర్పిసి స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, ఐఈఏ స్థానంలో భారతీయ సాక్ష్య అధినయం చట్టాలు అమలులోకి వచ్చాయన్నారు. ప్రస్తుతం సాంకేతికత ఎంతో పెరిగిందన్నారు. పెరిగిన సాంకేతికతతో నేరాలు కూడా పెరుగు తున్నాయి అన్నారు. అదేవిధంగా నూతన చట్టాలలో మహిళలు, చిన్నారుల రక్షణకు, భద్రతకు అనేక అంశాలు పొందుపరిచి ఉన్నాయన్నారు. జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రంలో పోలీస్ శాఖ సంస్కరణలు, చట్టాల అమలు తీరుపై మంచి పేరు ఉందని అన్నారు. జిల్లాలో అధికారుల సమన్వయం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నియంత్రణకు తోడ్పాటు నందించాలన్నారు. నూతన న్యాయ చట్టాలపై పోలీస్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల పనితీరు, తీసుకుంటున్న చర్యలపై వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఆర్వో వై. వి. గణేష్, డీసీపీ సలీమా, డీఈఓ వాసంతి, డిఎంహెచ్వో డాక్టర్ లలిత దేవి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డాక్టర్ కె. నారాయణ, ఏసీపీలు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గుదిబండగా ఎన్నికల హామీలు !

**తొలి సమయం హైదరాబాద్,అక్టోబర్16:**

ఎన్నికల్లో వాగ్దానాలు చేయడం ఎంత సులువో..వాటిని అమలు చేయడం అంత కష్టం అని సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇప్పుడిప్పుడే తెలిసొస్తోంది. రైతురుణమాఫీపై ఎంతగా విమర్శలు వస్తున్నాయో చెప్పలేం. దానిని సమర్థంగా తిప్పి కొట్టలేక పోతున్నారు. ఇకపోతే దుబారా ఖర్చులు తగ్గించుకుని అభివృద్ధికి బాటలు వేయాలి. పేదల జోలికి వెళ్లకుండా చూసుకోవాలి. హైడ్రాను కేవలం ఉన్నతవర్గాల ఆక్రమణలకే పరిమితం చేయాలి. పేదలకు ప్రత్యామ్నాయం చూపి ముందుకు సాగాలి. అలాగే తొలుత అభివృద్ధి పనులకు పెద్దపీట వేయాలి. రుణాల జోలికి వెళ్లకుండా, ప్రజలపై భారం మోపకుండా, గుదిబండ గా ఉన్న పథకాలను ముందు పక్కన పెట్టే ప్రయత్నం చేయాలి. విద్యా, వైద్య రంగాల్లో చర్యలను ఆహ్వానించాల్సిందే. అయితే నేటికీ వైద్యరంగం వెక్కిరిస్తోంది. ప్రైవేట్ వైద్యానికే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. అందువల్ల క్షేత్రస్థాయిలో దీనిని ప్రథమంగా సంస్కరించాలి. ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయాలి. ఆస్పత్రులను బలోపేతం చేయాలి. ఇలా చేయడం వల్ల ఆరోగ్య రంగం బలోపేతం అవుతుంది. ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లేలా చేయాలి.అప్పుడే ప్రభుత్వంపై భారం తగ్గగలదు. కానీ అలా చేసే దమ్ము కనిపించడం లేదు. అందులోనూ కాంగ్రెస్‌లో కుమ్ములాటలు, వర్గాలు ఎప్పుడూ మేల్కొని ఉంటాయి. నాయకుడిని సులువుగా పనిచేయ కుండా చేస్తారు. అలా కాకుండా నాయకత్వ లక్షణాలతో కాంగ్రెస్‌లో పులిలా నిలబడ్డది ఉమ్మడి ఎపిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఒక్కరే. ఎంతో బలమైన నేతగా ఉన్న చెన్నారెడ్డిని సైతం అప్పట్లో ముప్పుతిప్పలు పెట్టారు. ఇప్పుడు రేవంత్ రెడ్డికి కూడా అలాంటి ముప్పే పొంచి ఉంది. ఆయన చుట్టూ ముళ్ల కంచెలే ఉన్నాయి. ఓ వైపు కేబినేట్‌లో ప్రతి ఒక్కరూ తమకుతాము సిఎంగా ఊహించుకుంటూ పోతున్నారు. అందుకే బలమైన నిర్ణయాలతోనే ప్రజల్లో నేతగా నిలబడే ప్రయత్నం చేయాలి. ధరణి,రేషన్ కార్డులు, ఇళ్లు వంటివన్నీ త్వరగా పూర్తి చేసే ప్రయత్నం చేయాలి.వాటిని అమలు చేసేందుకే సత్తా కావాలి. అందునా తెలంగాణలో ప్రస్తుత ఆర్థిక పరిస్థితి దారుణం గా ఉంది. గత ప్రభుత్వం 14లక్షల కోట్లు అప్పుల్లో ఉంచిందని ప్రభుత్వమే ఆరోపిస్తోంది. ఈ క్రమంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన సిఎం రేవంత్ రెడ్డికి ఎన్నికల హామీలను అమలు చేయడం అంత సులభం కాదు. ఎందుకంటే ఖజానా నిండుకుని ఉంటే ఇది పెద్ద సమస్య అయ్యేది కాదు. కొన్ని గ్యారెంటీలను అమలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందున్నది ముసళ్ల పండగే అని చెప్పుకోవాలి. ముళ్లకంచెల ను దాటాలి. ప్రధానంగా రైతులకు 2లక్షల రుణమాఫీ, రైతుబంధు పంపిణీని పూర్తి చేయాల్సిన కార్యక్రమాల్లో విమర్శలు రాకుండా చూడాలి.. ఈ హామీలను ప్రభుత్వంలోకి రాగానే నెరవేరుస్తామని మాట ఇచ్చారు. ఈ క్రమంలో రైతుబంధు ఎప్పుడు జమ చేస్తారో చెప్పాలని అప్పులు చేసిన నేతలు విమర్శిస్తున్నారు. పదేళ్ల దరిద్రపు వారసత్వాన్ని అందించిన బిఆర్‌ఎస్ ఇప్పుడు తమ హయాంలో ఉన్న సమస్యలపైనే నిలదీయడం సిగ్గుచేటు. స్కూళ్లు, కాలేజీలు, హాస్టళ్లు, ఆస్పత్రులల్లో సమస్యలు ఈనాటివి కాదు. ఇవన్నీ మరని బిఆర్‌ఎస్ నేతలు అప్పుడే డిమాండ్లు మొదలు పెట్టారు. ప్రధానంగా రైతుబంధుతో పాటు ధాన్యం కొనుగోళ్లపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఇచ్చిన మాట ప్రకారం రైతుబంధు ఎప్పట్నుంచి ఇస్తారో అసలుసిసలు రైతులకు స్పష్టత ఇవ్వాలి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతుబంధును ఎకరాకు రూ.15వేలు ఇస్తామని చెప్పారు.చిన్న,సన్నకారు రైతుల వివరాలను సేకరించి వారికే పట్టం కట్టాలి. అలాగే ఇలాంటి ఉదార పథకాలకు పాతర వేయాలి. రూపాయి కిలో బియ్యం పక్కన పెట్టాలి. హైడ్రా కారణంగా వస్తున్న విమర్శలను సమర్థంగా ఎదుర్కోవాలి. ఇదంతా ఒక ఎత్తయితే.. కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆర్థిక స్థితిని చక్కదిద్దుకుంటూనే.. పార్టీని సమన్వయం చేసుకుంటూ సాగాల్సిన అవసరం సిఎం రేవంత్ ముందుంది. ఎన్నికలకు ముందునుంచే అనేక సందర్భాల్లో ప్రభుత్వం వస్తే ఎలా చేస్తామో..ఎలా ముందుకు వెళతామో అన్న స్పష్టమైన విధానాలను రేవంత్ రెడ్డి ప్రకటించారు. బహుశా ఆయన మదిలో ఇవన్నీ అమలు చేయడమెలా అన్న ప్రణాళిక ఉండివుంటుంది. ప్రభుత్వపరంగా ఇవన్నీ చేయడం ఒక ఎత్తయితే పార్టీలో అందరినీ కూడగట్టుకుని పోవాల్సి ఉంటుంది. పదవుల మీద ఆశతో చాలామంది ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కొద్దిపాటి మెజారిటీ మాత్రమే లభించడంతో పాటు, పార్టీ కోసం శ్రమించిన వారు అనేకులు బయట ఉన్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేలు అందరినీ సమన్వయం చేసుకుంటూ వెళ్లడం కత్తిమీద సాములాంటిది. కాంగ్రెస్ అధిష్టానం రేవంత్ రెడ్డికి పూర్తి అండగా ఉన్నప్పటికీ శాసనసభ్యులను విశ్వాసంలోకి తీసుకుని కదలాల్సి ఉంటుంది. సుస్థిర, సమర్థ ప్రభుత్వాన్ని అందించడం ద్వారా ముందుకు సాగడం ప్రస్తుతం రేవంత్ రెడ్డికి కత్తి మీద సాము లాంటిదే. సొంత పార్టీ నుంచి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడం ఒక ఎత్తయితే..విపక్ష బీఆర్‌ఎస్ విసిరే సవాళ్లను కూడా పసిగట్టి ముందుకు సాగాల్సిన ఉంటుంది. గెలిచినా అధికారం కోల్పోయామన్న విపక్షంలో ఉన్న ఎమ్మెల్యేల బాధ మరో వైపు ఉన్న ప్రస్తుత తరుణంలో ఇప్పుడంతా ఎవరు ఎటువైపు దూకుతారన్న చర్చ తెలంగాణలో ప్రధాన అంశంగా ఉంది. గతంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన పలువురు బిఆర్‌ఎస్‌లో చేరారు. వారంతా ఇప్పుడు మళ్లీ ఎమ్మెల్యేలుగా గెలిచి విపక్షంలో ఉన్నారు. ఎందుకంటే పార్టీ మారడం ఎంత సులువో గతంలో బిఆర్‌ఎస్ దారిచూపింది. అందుకే కాంగ్రెస్ ముందు జాగ్రత్తగా కొందరు ఎమ్మెల్యేలను చేర్చుకునే ప్రయత్నాలు చేసింది. అయితే మిగతా వారు అంతా కట్టగట్టుకుని వస్తారని భావించారు. కానీ అలాంటి అవకాశం లేకుండా బిఆర్‌ఎస్ జాగ్రత్తలు తీసుకుంది. ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసింది. కాంగ్రెస్ పార్టీలో అధిష్ఠానం మాటే శిరోధార్యం. అటు వారిని మెప్పించాలి. అధిష్టానానికి అందే ఫిర్యాదులకు సమాధానం ఇవ్వాలి. అలాగే ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ఇవన్నీ కనిపెట్టుకుని రేవంత్ రెడ్డి ముందుకు సాగాలి. అప్పుడే సమర్థుడైన నేతగా సాగుతారు. ప్రజాదర్బార్ నిర్వహించడం, విద్యుత్ శాఖ పనితీరును సమీక్షించడం, చకచకా నిర్ణయాలు తీసుకోవడం వంటి చర్యల ద్వారా రేవంత్ రెడ్డి ప్రస్తుతానికి దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఈ క్రమంలో రేవంత్ రెడ్డికి తన పదవిని సుస్థిరం చేసుకోవడంతో పాటు హామీలు అమలు చేయడం ద్వారా ఎదురులేని నేతగా ఎదగడానికి కృషి చేయాలి. తక్కువ సమయంలో ఇచ్చిన హామీలను చకచకా అమలు చేయగలగాలి. తానేమిటో నిరూపించుకుని ప్రజలతో మంచి అనిపించుకోవాలి. కేసీఆర్‌ను మించిన నేతగా పేరు తెచ్చుకుంటేనే రాజకీయంగా రేవంత్ నిలదొక్కు కోగలడు. అందుకే కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూనే.. తాను మరింత బలపడాల్సిన పరిస్థితి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఉంది.

# ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లను సిద్ధం చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి



**తొలి సమయం హన్మకొండ అక్టోబర్ 16**

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి అన్నారు.బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ఖరీఫ్ సీజన్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ పై ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులు, కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద దొడ్డు,సన్న రకం ధాన్యానికి సంబంధించిన కనీస మద్దతు ధర తెలిపే విధంగా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. దొడ్డు, సన్న రకం ధాన్యాల కొనుగోలుకు వేరువేరు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500లను బోనస్ ప్రకటించిందని, వాటి కొనుగోలులో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సన్న రకం ధాన్యాన్ని గుర్తించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో డిజిటల్ మైక్రో కాలిపర్స్, ప్యాడి క్లీనర్స్, డ్రయ్యర్స్ ను కొనుగోలు చేసి అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన సన్న రకం ధాన్యం బస్తాలకు ఎరుపు రంగు దారంతో కుట్లు వేయాలన్నారు. దొడ్డు రకం ధాన్యం సంచులకు ఆకుపచ్చ రంగు దారంతో కుట్లు వేయాలన్నారు. సన్నరకం ధాన్యం నింపే కొత్త సంచులను తిరగేసి ధాన్యం నింపిన అనంతరం వాటికి సంబంధించిన వివరాలను సంచులపై ఎస్ గుర్తుతో పాటు సెంటర్ నెంబర్ స్టెన్సిల్తో మార్క్ చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కు సంబంధించి వ్యవసాయ అధికారులు అందించిన టోకెన్ ఆధారంగానే ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలును చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఉమారాణి, మేనేజర్ మహేందర్, జిల్లా సహకార అధికారి నీరజ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ జేడీ రవీందర్ సింగ్, జిల్లా మార్కెటింగ్ అధికారి అనురాధ, ఇతర అధికారులతో పాటు ప్యాక్స్ కార్యదర్శులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్చార్జులు పాల్గొన్నారు.

# తిరుమలలో భారీ వర్షాలు

### విరిగిపడ్డ కొండచరియలు

**తిరుమల,అక్టోబర్16:** వర్షాల కారణంగా తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే ఘాట్‌రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో స్వల్పంగా బండరాళ్లు రోడ్డుపై పడ్డాయి. జేసీబీల ద్వారా సిబ్బంది వాటిని తొలగిస్తున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తితిదే ముందస్తు చర్యలు చేపట్టింది.శ్రీవారి పాదాలు, ఆకాశ గంగ, జాపాలి, పాపవినాశనానికి భక్తులను తితిదే అనుమతించడం లేదు. ఇప్పటికే తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దుచేశారు. వర్షాల కారణంగా భక్తుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు. తిరుమల గిరుల్లో వర్షాలతో మాల్వాడిగుండం భారీగా ప్రవహిస్తోంది. కొండల నుంచి వస్తున్న నీటితో తిరుపతి కాలనీల్లోకి వరద వచ్చి చేరుతోంది. రాజీవ్‌గాంధీ కాలనీ, ఆటోనగర్, కొరమీనుగుంటలో వరద వస్తోంది. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం గుడిమల్లం వద్ద సీత కాల్వ కాజ్‌వేపై వరద ప్రవహిస్తోంది. వర్షాల కారణంగా జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్, జిల్లా స్థాయిలో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు. గూడూరు సబ్‌కలెక్టరేట్‌లో ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచారు. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లోని తీరప్రాంతాల్లో, వాకాడు, తడ, కోట, సూళ్లూరుపేట, చిల్లకూరులో వర్షం కురుస్తోంది.

## సాగర్‌కు పెరిగిన వరద..నాలుగు గేట్లు ఎత్తివేత

**నల్గొండ,అక్టోబర్16:** ఎగువన కురుస్తున్న వర్షాలతో నాగార్జునసాగర్‌కు వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు ప్రాజెక్టు 4 క్రస్ట్ గేట్లు ఐదు అడుగుల మేర ఎత్తి స్పిల్ వే ద్వారా 32,400 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ఇన్ ఎ÷‌-లో, ఔట్ ఎ÷‌-లో 76,555 క్యూసెక్కులుగా ఉంది. ప్రస్తుత, పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులుగా నమోదైంది. సాగర్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటి నిల్వ కూడా 312.0450 టీఎంసీలుగా ఉంది.

# హైడ్రాకు మరిన్ని అధికారాలు

**జిహెచ్‌ఎంసి చట్టంలోని పలు అధికారాలు బదిలీ**

**అక్రమ నిర్మాణాలు, అనధికారిక కట్టడాలకు ఇక నోటీసులు**

**హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి**

**తొలి సమయం హైదరాబాద్,అక్టోబర్16:** మహా నగరంలో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు, అనధికారిక కట్టడాలకు సంబంధించి హైడ్రానే నోటీసులు జారీ చేస్తుందని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. అనధికారిక భవనాల కూల్చివేత అధికారం కూడా హైడ్రాకు లభించిందన్నారు. నగరంలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రాకు జీహెచ్‌ఎంసీ చట్టంలోని అధికారాలను బదిలీ చేస్తూ పురపాలకశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులపై స్పందించిన కమిషనర్ రంగనాథ్.. జీహెచ్‌ఎంసీ చట్ట సవరణతో హైడ్రాకు పూర్తి స్థాయి అధికారాలు వచ్చాయన్నారు. ఇకపై ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం హైడ్రానే నోటీసులు జారీ చేస్తుందని స్పష్టం చేశారు. అలాగే కూల్చివేతలు, స్వాధీనం సహా తదితర అధికారాలన్నీ హైడ్రాకు లభించాయని రంగనాథ్ పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల వల్ల హైడ్రా మరింత బలపడిందన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ చట్ట ప్రకారం, ఓఆర్‌ఆర్ పరిధిలోని 27 మున్సిపాలిటీలకు పురపాలక చట్టం ప్రకారం హైడ్రా నడుచుకుంటుందని తెలిపారు. తాజా ఉత్తర్వులతో రానున్న రోజుల్లో అక్రమ నిర్మాణాల పాలిట హైడ్రా మరింత దూకుడుగా వ్యవహరించ బోతున్నట్టు తెలుస్తోంది. అయితే, ఇటీవల కొన్ని నిర్మాణాల కూల్చివేతల విషయంలో కోర్టుల నుంచి యథాతథ స్థితి కొనసాగించాలన్న ఆదేశాలు ఉన్న నేపథ్యంలో కొంత ఆచితూచి వ్యవహరిస్తోంది. ప్రస్తుతం కోర్టులు స్టేఇచ్చిన నిర్మాణాల జోలికి వెళ్లకుండా గతంలో కూల్చివేతల ఆదేశాలున్న వాటిపై హైడ్రా దృష్టి సారిస్తోంది.

# గుండెపోటుతో చిన్నారి మృతి

### కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

**తొలి సమయం కరీంనగర్,అక్టోబర్16:** కరీంనగర్ జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. కళ్లేదుటే ఐదేళ్ల చిన్నారి గుండెపోటుకు గురై విగతజీవిలా పడిపోయింది. ఈ దృశ్యం చూసి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీర య్యారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన రాజు, జమున దంపతులకు ఉక్కులు(5) అనే కుమార్తె ఉంది. ఏకైక సంతానం కావడంతో బాలికను అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. అయితే ఎప్పటిలాగానే మంగళవారం ఉదయం నిద్రలేచిన బాలిక కాసేపు ఆడుకుంది. కాసేపటి తర్వాత తనకు కళ్లు తిరుతున్నాయనే విషయాన్ని తల్లికి తెలియజేసింది. అయితే బాలికను తల్లి జమున స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడి వైద్యులు పరీక్షించి వెంటనే హన్మకొండ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాల్సిందిగా సూచించారు. దీంతో హుటాహుటిన తల్లిదండ్రులు చిన్నారిని తీసుకుని హన్మకొండ ఆస్పత్రికి చేరుకున్నారు. అయితే వైద్యులు పరీక్షిస్తుండగానే ఉక్కులు మృతి చెందింది. బాలిక గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఉక్కులుకు పుట్టినప్పటి నుంచే గుండె సంబంధిత సమస్యలు ఉన్నాయని, ఆ విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించలేకపోయాని డాక్టర్లు తెలిపారు.

# కాశ్మీర్‌లో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

**సిఎంగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణం**

**కేబినెట్‌లోకి ఐదుగురు మంత్రులకు చోటు**

**ఓ మహిళా మంత్రికి అవకాశం ఇచ్చిన సిఎం**

**ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండాలని డిజిపికి సిఎం ఆదేశాలు**

**సిఎం పదవి ముళ్ల కిరీటం లాంటిదన్న ఫరూక్ అబ్దుల్లా**



**శ్రీనగర్,అక్టోబర్16:** జమ్మూ కశ్మీర్ నూతన ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆయనతో ప్రమాణం చేయించారు. బుధవారం ఉదయం 11.30 గంటలకు శ్రీనగర్‌లోని షెరి కశ్మీర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఒమర్ ప్రమాణస్వీకారం చేశారు. ఐదుగురిని తన క్యాబినెట్‌లోకి తీసుకున్నారు. వీరిలో నేషనల్ కాన్ఫరెన్స్ నుంచి నలుగురు, ఒక స్వతంత్ర అభ్యర్థి ఉన్నారు. ఎన్‌సీతో కూటమిగా ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ నూతన ప్రభుత్వంలో చేరడం లేదని, బయట నుంచి మద్దతిస్తామని తెలిపింది. శ్రీనగర్‌లోని షేర్-ఇ-కశ్మీర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్‌లో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలు హాజరయ్యారు. వీరితో పాటు ఇండియా కూటమికి చెందిన ఇతర నేతలు వచ్చారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దు చేసి, కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించిన తర్వాత ఏర్పాటైన తొలి ప్రభుత్వం ఇది. ఈ ప్రభుత్వానికి కాంగ్రెస్ వెలుపలి నుంచి మద్దతు ప్రకటించింది. ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారం చేసిన కొద్ది సేపటికే పోలీసులకు తొలి ఆదేశాలిచ్చారు. వీఐపీల పర్యటన సమయంలో రోడ్లపై ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, లాఠీలు చూపించడం, దురుసుగా ప్రవర్తించడం చేయరాదని ఆదేశించారు. సీఎంగా తన రాకపోకల కోసం గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. జమ్మూకశ్మీర్ డీజీపీతో ఫోనులో మాట్లాడాను. వీఐపీల రాకపోకల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలకరాదని చెప్పాను. లాఠీలు ఝుళిపించడం, దురుసుగా ప్రవర్తించడం చేయవద్దని ఆదేశాలిచ్చాను. మన ప్రవర్తన పీపీల్స్-ఫ్రెండ్రీగా ఉండాలని నా మంత్రివర్గ సహచరులకు కూడా సూచించాను. ప్రజాసేవ కోసమే పదవుల్లో ఉన్నాం, వారికి అసౌకర్యం కలిగించడానికి కాదని చెప్పాను అని ఒమర్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. ప్రమాణం చేసిన మంత్రుల్లో ఒకే ఒక్క మహిళ ఉన్నారు. ఆమే సకీనా ఈటూ సకీనా.. దక్షిణ కశ్మీర్‌కు చెందిన కుల్గామ్ జిల్లాలోని డీహెజ్ పోరా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. ఆమె పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి గుల్జార్ అహ్మద్ దర్‌పై 17,449 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ప్రముఖ రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఆమె నేషనల్ కాన్ఫరెన్స్‌లో వివిధ హోదాల్లో పనిచేశారు. ఆమె తండ్రి వలీ మోహమ్మద్ ఈటూ.. ఈ పార్టీలో కీలకంగా వ్యవహరించారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. ఆయన 1994లో హత్యకు గురయ్యారు. ఆ తర్వాత తండ్రి వారసత్వాన్ని అందుకొని ముందుకు సాగుతోన్న ఆమె సోదరుడిని 2001లో ఉగ్రవాదులు బలిగొన్నారు. అప్పుడు ఆమె వైద్యవిద్యను అభ్యసిస్తున్నారు. తండ్రి, సోదరుడి మరణాలతో వెనకడుగు వేయని ఆమె రాజకీయ ప్రయాణాన్ని మొదలుపెట్టారు. ఆమెపై కూడా 20 సార్లకు పైగా హత్యాయత్నాలు జరిగాయి. వాటన్నింటిని దాటుకొని.. జమ్మూకశ్మీర్ ప్రభుత్వంలో వివిధ హోదాల్లో పనిచేశారు. లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు నిర్వర్తించారు. పర్యాటక శాఖ, విద్యాశాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2008 నుంచి 2014 వరకు సామాజిక సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నారు. 53 ఏళ్ల వయసులో తాజాగా కేబినెట్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. జమ్మూకశ్మీర్‌లో ప్రజాదరణ ఉన్న అతి కొద్దిమంది మహిళా నేతల్లో ఈమె ఒకరు. సామాజిక సంక్షేమం, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందారు. జమ్మూలోని నౌషేరా నుంచి ఎన్నికైన సురిందర్ చౌధరీ డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. జమ్మూ ప్రాంతం ప్రజల గళాన్ని వినిపించేందుకు ఆయన్ను ఈ పదవికి ఎంపిక చేసినట్లు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వెల్లడించారు. ఈ ప్రభుత్వంలో తమకు ప్రాతినిధ్యం వహించేవారు లేరని జమ్మూ ప్రజలు బాధపడాల్సిన పనిలేదు. ఆ ప్రాంతం నుంచి ఉపముఖ్యమంత్రిని ఎంపిక చేశాను. దీంతో ఈ ప్రభుత్వం తమదని స్థానిక ప్రజలు భావిస్తారని సీఎం అన్నారు. అయితే.. ఈ కార్యక్రమం అనంతరం ఆయన తండ్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సీఎం బాధ్యత ముళ్ల కిరీటం లాంటిదని.. ప్రజల ఆశలను నెరవేర్చడంలో దేవుడు తన తనయుడికి అండగా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రం ముందు ఎన్నో సవాళ్లు ఉన్నాయి. ఈ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్ట్లోలో ఇచ్చిన హామీలను నెరవేర్చుతుందని నేను నమ్ముతున్నాను అని ఫరూక్ అబ్దుల్లా అన్నారు. కొత్త ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత రాష్ట్ర హోదా పునరుద్ధరణ అని ఒమర్ అబ్దుల్లా కుమారుడు జహీర్ అబ్దుల్లా పేర్కొన్నారు.

# ఉచిత ఇసుక లక్ష్యం దెబ్బతినరాదు

**- ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రావద్దు**

**- సామాన్యులకు భారం కాకుండా చూడాలి - మంత్రులకు సిఎం చంద్రబాబు వార్నింగ్**



**అమరావతి,అక్టోబర్16:** ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత ఇసుక విధానం లక్ష్యం నెరవేరాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులకు స్పష్టంచేశారు. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టినా ఇసుక పొందడంలో ఇబ్బందులు పడటంతో పాటు ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో మంత్రమండలి సమావేశంలో చంద్రబాబు ఇసుక విషయంలో సీరియస్ అయినట్లు తెలుస్తోంది. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఇసుకను అందుబాటులో ఉంచడంతో పాటు ఇంటి నిర్మాణంలో ఇసుక కొనుగోలు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెడితే కొందరు దళారులు సామాన్య ప్రజలకు ఇసుకను భారంగా మార్చడంపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఉచిత ఇసుక విధానంలో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోనని, వెంటనే మార్పు రావాలని చంద్రబాబు ఆదేశించారు. ఉచిత ఇసుక విధానంలో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోనని, వెంటనే మార్పు రావాలని చంద్రబాబు ఆదేశించారు. పది రోజుల్లో మార్పు కనిపిం చాలని, నిజమైన లబ్దిదారుడికి ఉచిత ఇసుక పథకంతో ప్రయోజనం కలగాలని సీఎం పేర్కొన్నారు. ఇసుక రాష్ట్రం లో విరివిగా దొరకాలని, అన్ని అడ్డంకులు తొలగించి సామాన్య ప్రజలకు ఉచిత ఇసుక అందించి తీరాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత ఇసుక విధానాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిలో భాగంగా ఇసుక రీచ్‌ల నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలనే ప్రతిపాదనకు ప్రభుత్వం ఇటీవల ఆమోదం తెలిపింది. ఉచిత రీచ్‌లకు అదనంగా ప్రైవేటు రీచ్‌లనూ ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. పేరు ఏదైనా... ప్రజలకు అవసరమైన ఇసుక, వారికి ఆమోదయోగ్యమైన ధరతో అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంది. అక్టోబర్ 11వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద ఇసుకపై సమీక్షించారు. ఈ సందర్భంగా గనుల శాఖ అధికారులు పలు ప్రతిపాదనలను సీఎం ముందుంచిన విషయం తెలిసిందే. రీచ్‌లను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడం వల్ల ఇసుక స్టాక్ పాయింట్ల పరిశీలన, నిరంతర, సరఫరా పర్యవేక్షణ సులభతరం అవుతుందని అధికారులు కోరగా.. ఇసుక సరఫరా ధరను జిల్లా ఇసుక కమిటీలే నిర్ణయించేలా చర్యలు తీసుకోవాలని, అక్రమాలకు తావులేకుండా చూసుకోవాలని సీఎం సూచించారు. నిరంతర నిఘా, పర్యవేక్ష ణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఇసుక రీచ్‌ల నిర్వహణకు జిల్లాల వారీగా టెండర్ల ద్వారా ప్రైవేటు ఏజెన్సీలను ఎంపిక చేయనున్నట్లు తెలిసింది. ఇసుక లభ్యతను పెంచేందుకు ప్రైవేటు రీచ్‌లను ప్రారంభించాలని గనుల శాఖ ప్రతిపాదించింది. దీని ప్రకారం ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు, ఏజెన్సీలు గనుల శాఖ నుంచి అనుమతి తీసుకొని సొంతంగా రీచ్‌లను ప్రారంభించి ఇసుక తవ్వకాలు చేపడతారు. ఉచిత ఇసుక పాలసీలో భాగంగా ప్రస్తుతం ఇసుక రీచ్‌లు గనుల శాఖ నియంత్రణలో ఉన్నాయి. వర్షాకాలం కావడంతో రీచ్‌ల్లో తవ్వకాలు చేపట్టడం లేదు. త్వరలో తవ్వకాలు ప్రారంభించినప్పటికీ డిమాండ్‌కు సరిపడేంతగా ఇసుక అందుబాటులోకి రాదనే ఉద్దేశంతో ప్రైవేటు రీచ్‌ల ప్రతిపాదన తెస్తున్నట్లు గనుల శాఖ అధికారులు వివరించారు.

# వాయుగుండంతో తెలంగాణకు అలర్ట్

**నాలుగు రోజుల పాటు వర్షాలు**

**హైదరాబాద్,అక్టోబర్16:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నాయి. వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో మరో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఈ మేరకు రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, నల్లగొండ, హైదరాబాద్ జిల్లాల్లో వర్షం పడే ఛాన్స్ ఉందని తెలిపింది. వాతావరణ కేంద్ర అంచనాలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. లోతట్టు ప్రాంతాలను ప్రజలను అలర్ట్ చేసింది. భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలను అప్రమత్తం చేసింది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఆంధ్రప్రదేశ్ లోనూ వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. దక్షిణకోస్తా, రాయలసీమలో కొన్ని ప్రాంతాలకు భారీ నుండి అతిభారీ వర్షసూచన ఉన్నట్లు తెలిపింది. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల్లో ఆకస్మిక వరదలు (ఎ÷-లాష్ ఫ్లడ్) సంభవించే అవకాశం ఉందని పేర్కొంది. భారీ వర్షాలు కురిసే అశకాశం ఉన్న నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. పెన్నా నది పరీవాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అలర్ట్ చేసింది. సహాయక చర్యల కోసం జిల్లాల్లో 5 ఎస్డీఆర్ఎఫ్, 2 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ప్రభుత్వం రంగంలోకి దింపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రస్తుతం చెన్నైకి 280 కి.మీ, పుదుచ్చేరికి 320 కి.మీ, నెల్లూరుకి 370కి.మీ దూరంలో కేంద్రీకృతమై.. పశ్చిమ వాయువ్య దిశగా 15కిమీ వేగంతో కదులుతున్నట్లు వెల్లడించింది.

# హత్యకు గురైన రేణుకాస్వామికి పుత్ర సంతానం

**పండండి బిడ్డకు జన్మనిచ్చిన భార్య సహానా**

**తన కొడుకు తిరిగి వచ్చాడని సంబుర పడ్డ తండ్రి కాశీనాథయ్య**

**బెంగుళూర్,అక్టోబర్16:** కర్నాటకలో హత్యకు గురైన రేణుకా స్వామి భార్య పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. కన్నడ నటుడు దర్శన్, అతడి గ్యాంగ్ కలిసి రేణుకా స్వామి అనే వ్యక్తిని చిత్రహింసలకు గురి చేసి హత్య చేశారని పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం నటుడు దర్శన్, అతడి ఫ్రెండ్స్ ఈ కేసులో అరెస్ట్ అయ్యి జైలులో ఉన్నారు. ఇదిలా ఉండగా.. మృతుడు రేణుకా స్వామి తండ్రి అయ్యాడు. బుధవారం రేణుకా స్వామి భార్య సహానా పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. రేణుకా స్వామి హత్యకు గురైన సమయంలో సహానా ఐదు నెలల గర్భంతో ఉండగా.. తాజాగా బిడ్డకు జన్మనిచ్చింది. రేణుకా స్వామి తండ్రి కావడంతో అతడి తండ్రి కాశీనాథయ్య సంతోషం వ్యక్తం చేశాడు. మనువడిని చూసి కన్నీంటి పర్యంతమైన కాశీనాథయ్య.. తన కొడుకు మళ్లీ తిరిగొచ్చాడంటూ ఎమోషనల్ అయ్యారు. తన కోడలికి ఉచిత ప్రసవం చేసిన ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక, రేణుకా స్వామి హత్య కేసుపై మాట్లాడుతూ.. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో ఈ కేసును విచారించాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న కన్నడ సూపర్ స్టార్ దర్శన్, అతని భాగస్వామి పవిత్ర గౌడ బెయిల్ పిటిషన్‌లను రద్దు చేస్తూ కోర్టు ఇచ్చిన తీర్పును రేణుకా స్వామి కుటుంబ సభ్యులు స్వాగతించారు. కాగా, తన ప్రియురాలు పవిత్ర గౌడ్‌కు రేణుకా స్వామి సోషల్ మీడియాలో అసభ్యకర మేసేజ్‌లు పెట్టాడనే అనుమానంతో యాక్టర్ దర్శన్ అతడి ఫ్రెండ్స్ రేణుకా స్వామిని కిడ్నాప్ చేశారు. అనంతరం రేణుకా స్వామిని చిత్రహింసలకు గురి చేయడంతో అతడు మృతి చెందాడు. రేణాకా స్వామి హత్య కన్నడ సినీ, రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించింది. రేణుకాస్వామిని కిడ్నాప్ చేసి దారుణంగా హత్య చేశారన్న అభియోగాలపై దర్శన్, పవిత్రగౌడ్, మరో 15 మందిని జూన్ 11న అరెస్టు చేశారు. ప్రస్తుతం జ్యుడిషియల్ రిమాండ్ లో భాగంగా దర్శన్, పవిత్ర జైలులో ఉన్నారు.

# పారదర్శకంగా ఉచిత ఇసుక సరఫరా

**అధికారులకు జాయింట్ కలెక్టర్ ఆదేశాలు**

**విజయవాడ,అక్టోబర్16:** వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా ఉచిత ఇసుకను సరఫరా చేసేలా అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా అధికారులను ఆదేశించారు. ఉచిత ఇసుక విధానంలో భాగంగా కంచికచర్ల మండలం పెండ్యాల 1,2 రీచ్‌ల పరిధిలోని నందిగామ మండలం కంచెల గ్రామంలోని ఇసుక స్టాక్ యార్డ్, వత్సవాయి మండలం శనగపాడు, ఇందుపల్లి స్టాక్ యార్డ్‌లను బుధవారం జాయింట్ కలెక్టర్ నిధి మీనా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా 15 రీచ్‌లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని దీనిలో భాగంగా ముందుగా నేడు నాలుగు రీచ్‌లను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రస్తుతం నీటి ప్రవాహం ఉన్నందున 11 రీచ్‌లలో ప్రవాహం తగ్గిన వెంటనే ప్రారంభించి ఇసుకను అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన నాలుగు రీచ్‌లలో 3 లక్షల 69 వేల మెట్రిక్ టన్నులతో పాటు ఇప్పటికే అందుబాటులో ఉన్న మోగులూరు, కీసర, అనుమంచిపల్లి స్టాక్ యార్డ్‌లతో కలిపి మొత్తం 15 రీచ్‌లకు సంబంధించి 11 లక్షల 6వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ప్రారంభించిన రీచ్‌లకు సంబంధించి మ్యాపింగ్ నిర్వహిస్తున్నందున రేపటి నుండి అన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ఇసుకను వినియోగదారులకు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. కొత్తగా ప్రారంభించిన రీచ్‌లలో జిల్లా ఇసుక స్థాయి కమిటీ టన్ను ఇసుక 232 రూపాయల ధరను నిర్ణయించడం జరిగిందన్నారు. ఉచిత ఇసుక విధానంలో మరింత పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పాటించడంతో పాటు ఇసుక సరఫరా పై నిరంతర నిఘా ఉంచాలన్నారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101